సంక్షేమ పథకాల అమల్లో ఆదర్శం

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



గుమ్మేపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం గుమ్మేపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం గడప గడపకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. వారితో సంక్షేమ పథకాల అమలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీ భేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జగనన్న పాలనలోఅన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరును ఇతర రాష్ట్రాలు గుర్తించి, వారు కూడా ఈ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. జగనన్న పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గతంలో సంక్షేమ పథకాలందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు సిఫారసు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ జగనన్న పాలనలో అర్హత ఉన్న వారికి ఇళ్ల పట్టే అందుతున్నాయని గుర్తు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, సోమిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఈశ్వరయ్య, ఆదెప్ప, బ్యాల్ల నాగేంద్ర, ఎర్రిస్వామి, గోపాల్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ నాయక్, మండల యూత్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పామిడి: కండ్లపల్లి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా నక్కా చిన్న వన్నూరప్ప భార్య ఎస్ లక్ష్మీదేవికి కుష్టు పింఛన్ వర్తించని విషయంపై సచివాలయ సిబ్బందితో ఆరా తీశారు. లక్ష్మీదేవి తన వ్యాధికి మాన్యువల్ సర్టిఫికెట్ పొందినట్లు గుర్తించారు. ఆమెకు సదరన్ క్యాంప్ ద్వారా సర్టిఫికెట్ పొందేలా దరఖాస్తు చేయించాలని ఈసందర్భంగా ఎంపీడీఓ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సూచించారు.

రాయల విగ్రహం చుట్టూ టీడీపీ ఫ్లెక్సీలు



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం కనిపించకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

గుత్తి: పట్టణంలో ఈ నెల 7న టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో రాయల్ సర్కిల్లో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం చుట్టూ(విగ్రహం కనిపించకుండా) ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వివాదంగా మారింది. బలిజ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు మారాకుల రమణ, శ్రీకరం హరి, కోశాధికారి మంజు రాయల్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులకు ఫోన్‌లు చేసి తొలగించాలని డిమాండ్ చేశారు. తొలగిస్తామని చెప్పిన టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను తొలగించలేదు.

కంపచెట్ల తొలగింపు

పెద్దవడుగూరు : జి.వెంకటాంపల్లిలో శ్మశాన వాటికకు వెళ్లే దారిలో పెరిగిన కంపచెట్లను గ్రామానికి చెందిన యువకులు దేవర రమేష్‌రెడ్డి, హరినాథ రెడ్డి మంగళవారం తొలగించారు. ఎంపీపీ పాఠశాల ఆవరణాన్ని డ్రోజర్‌తో శుభ్రం చేయించారు.

క్లుప్తంగా

కొత్త పింఛన్‌దారులకు సొమ్ము అందజేత



పింఛన్ సొమ్మును అందిస్తున్న దృశ్యం

గుత్తి: స్థానిక 16వ వార్డులో కొత్తగా పింఛన్ మంజూరైన ఐదుగురికి మంగళవారం పింఛన్ సొమ్మును అందజేశారు. మున్సిపల్ కౌన్సిలర్ నరేష్, సచివాలయ ఉద్యోగి వెంకటేష్, సచివాలయ కన్వీనర్ షాషావలి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందించారు. గృహసారథులు మైను, మహబుబ్బీ, అమీనా, వలంటీర్లు మైనుద్దీన్, విజయ్, రాజేష్, మెహతాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు వెల్డింగ్ రవూఫ్, లాల్ బాషా, శివ,సద్దాం పాల్గొన్నారు.

మున్సిపల్ ఈఈగా గురప్పయాదవ్



గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఈఈగా కె.గురప్ప యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంఈగా పనిచేస్తున్న ఎస్.ఈశ్వరయ్య గత నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ స్థానంలో పబ్లిక్‌హెల్త్ డీఈగా పనిచేస్తూ ఈఈగా పదోన్నతి పొందిన గురప్పయాదవ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.

ప్రజలతో గౌరవంగా వ్యవహరించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీ ఎస్పీ వెంకటశివారెడ్డి

శింగనమల: పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం శింగనమల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, గ్రామాల్లో శాంతిభద్రతలపై అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో కొన్ని రోజులుగా శింగనమల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించామన్నారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయిన, విధి నిర్వహణలో ఆరోపణలు వచ్చే సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


పేదల పక్షపాతి జగనన్న



నూతన పింఛన్లు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నార్పల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్లు తీసుకోవాలంటే రోజుల తడబడి కార్యాలయాల వద్ద ఎదురు చూసేవారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. మండల కేంద్రంలోనే నెల నెలా దాదాపు రూ.90 లక్షలు నగదును పింఛన్ ద్వారా అందిస్తోందన్నారు. సర్పంచు మన్నీల సుప్రియ,జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థ నాయుడు, నాయకులు బాలనాగి శీనా, భూషణ్‌రెడ్డి, చికెన్ గోపాల్, నాగరాజు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మాపురం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు



పెద్దక్కకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: ధర్మాపురం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు, ఒకటవ వార్డు సభ్యురాలు టి.పెద్దక్క ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి రవినాయక్ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. టి.పెద్దక్కను వార్డు సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన పెద్దక్కకు ఎన్నికల అధికారి రవినాయక్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ మక్కెల చంద్ర ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. పెద్దక్కను వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బీవీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా ముగిసింది. ముందుగా అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. గుంతకల్లు మండలంలో 384 ఇళ్లు మంజూరు కాగా అందులో 329 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, పీఎం ఏవై కింద 143 ఇళ్లు మంజూరు కాగా 80 ఇళ్లు నిర్మాణం చేపట్టారని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకూ గ్రౌండింగ్ కానీ ఇళ్లను కూడా ప్రారంభించేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలానికి రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల విలువగల మూడు డ్రోన్లు మంజూరయ్యాయని ఏఓ స్వాతి తెలిపారు. వీటిని 60 శాతం సబ్సిడీ అందిస్తారని, ఐదుగురు రైతులు బృందంగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉపాధిహామీ కింద రూ.52 వేలతో ఒక్కో సచివాలయం వద్ద ఒక్కో రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని ఏపీఓ కృష్ణమూర్తి తెలియజేశారు. బడిఈడు వయసు ఉన్న పిల్లలు ప్రతి ఒక్కరూ బడిలోనే ఉండాలే చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంఈఓ మస్తాన్‌రావు కోరారు. మండలంలో మగపిల్లలు 198 మంది ఉంటే ఆడపిల్లలు 145 మంది మాత్రమే ఉన్నారని వైద్యారోగ్యశాఖ సిబ్బంది తెలిపారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఈవోఆర్డీ బారన్ సాహెబ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లు: ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులతో పరిచయాలున్నాయని, మీకు ఎలాంటి ఉద్యోగం కావాలన్నా ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దని గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌లు సూచించారు. స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం విద్యార్థులకు ఉద్యోగాల పేరట జరిగే మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చాలామంది ఉద్యోగాల కోసం మోసపూరితమైన మాటలు నమ్మి రూ.లక్షలు ముట్టజెప్పి తీర ఉద్యోగాలు రాకపోవడంతో పోలీసులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఏ ఉద్యోగమైన ప్రభుత్వం నుంచి జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం నియమిస్తారన్నారు. మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పువని హెచ్చరించారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, జీఆర్‌పీ పోలీసులు పాల్గొన్నారు.

శింగనమల: సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని ఎఎస్ఐ చితంబరయ్య ప్రజలకు సూచించారు. మంగళవారం శింగనమల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబ్యాంక్‌లు ఓటీపీ అడగవన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా మహాకుంభాభిషేకం

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మహాకుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఆలయ మండపంలో వేదపండితులు లఘు రుద్రాభిషేకం, రుద్ర, కళా,దీక్షహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి, సభ్యులు, భక్తాదులు పూజల్లో పాల్గొన్నారు. బుధవారం ఆలయ రాజగోపుర ప్రారంభోత్సవం జరుగుతుందని, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరవుతారని వెంకటరెడ్డి తెలిపారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

గుత్తి రూరల్: టి.కొత్తపల్లి, తొండపాడులో మంగళవారం ఈ-క్రాప్ నమోదును ఏఓ ముస్తాక్ అహ్మద్ పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 9,300 ఎకరాలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. వీఏఏ స్వాతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

యల్లనూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యులు లోకేష్‌కుమార్ సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యుడు సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మధుకుమార్, ఏఎన్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

నార్పల: చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు మన్నీల సుప్రియ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్ సునాళిని, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెద్దవడుగూరు : కడదరగుట్టపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన మాబు తన కుటుంబ సభ్యులతో తాడిపత్రి వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కడదరగుట్టపల్లి సమీపంలోని మలుపు వద్ద బైక్‌పై అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో మాబు, అతని భార్య దస్తగిరమ్మ, కుమారులు రియాజ్, మన్సూర్ గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో పెద్దవడుగూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాహనాల వేలం

యాడికి: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం వేశారు. నాలుగు బైక్‌లు, కారు వేలం వేయగా రూ.50,622 వచ్చినట్లు గుత్తి ఎక్సైజ్ సీఐ వరలక్ష్మీ తెలిపారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు లాభదాయకం

తాడిపత్రి: బీడు భూముల్లో కంది, ఆముదం, అలసంద, అనుములు, గోరుచిక్కుడు, సజ్జ తదితర పంటలు సాగు చేసి లాభాలు పొందొచ్చని డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు. మంగళవారం రావి వెంకటాంపల్లె, యర్రగుంటపల్లె రైతులు ఆనంద్, వెంకటనారాయణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు.

ఘనంగా గ్రామదేవత ఊరేగింపు

గుంతకల్లు రూరల్: కసాపురంలో మంగళవారం గ్రామదేవత దేవమ్మ వారి ఊరేగింపు ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో వెలసిన అమ్మవారి పాదాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశంలో అమ్మవారిని ఆవాహనం చేసుకొని ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

యల్లనూరులో మోస్తరు వర్షం

యల్లనూరు: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. మండలంలో 3.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు డీటీ శ్వేత తెలిపారు.

పంచలోహ విగ్రహం మాయం!

యాడికి: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదురుగా ఉన్న గంగమ్మ గుడిలో శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహం చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానిక గంగమ్మ గుడి ఆవరణలో ఏటా ప్రజల విరాళాలతో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేవారు. తదనంతరం పంచలోహ విగ్రహాన్ని గంగమ్మ గుడిలో భద్రపరుస్తారు. గత సోమవారం శ్రీకృష్ణుని పంచలోహ విగ్రహం శుభ్రం చేసేందుకు కమిటీ సభ్యులు, ఆలయ పూజారితో కలిసి ఆలయంలోకి వెళ్లి చూడగా పెట్టెలో భద్రపరచిన 24 కేజీల పంచలోహ విగ్రహం కనపించలేదు. విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని భావించిన పూజారి రూ.20 వేలు, మిగిలిన సొమ్ము కమిటీ సభ్యులు భరించి బుధవారం రాత్రి పెద్దవడుగూరు మండలంలో నూతన విగ్రహం తెచ్చేందుకు మాట్లాడుకున్నట్లు సమాచారం. దీనిపై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డిని సంప్రదించగా చోరీ ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.

నేటి నుంచి సాయిబాబా మందిర రజతోత్సవాలు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయ రజతోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 7వ తేదీ సాయంత్రం నగరోత్సవం, 8న గణపతి పూజ, గోపూజ, నవగ్రహ, సుదర్శన హోమాలు, 9న విష్ణుసహస్రనామ పారాయణం, ఉయ్యాలవాడ రామకృష్ణారెడ్డి బృందంచే భగవద్గీత పారాయణం, 10న కుంభాభిషేకం ఉంటుందన్నారు.

సజావుగా 'ప్రజావేదిక'



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

శింగనమల: మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం సజావుగా జరిగింది. మండలంలో గతేడాది ఉపాధి హామీ కింద 9 కోట్లతో పనులు జరిగాయి. ఎస్ఆర్పీ లోకేష్, డీఆర్పీలు పంచాయతీల వారీగా తమ నివేదికలను చదివి వినిపించారు. ఏపీడీ సుధాకర్‌రెడ్డి, డీఈవీఓ రమణారెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ సునీల్ , ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్ నాగమునెమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



హెచ్ఎం వసుంధరను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



గుత్తి రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, చైర్‌పర్సన్



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తహసీల్దార్ మునివేలు, ఎంఈఓ నాగరాజు

బుక్కరాయసముద్రం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోజెడ్పీటీసీ భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాల భవితను మార్చే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లో ఉందన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, పాఠశాల హెచ్ఎం వసుంధర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి, సర్పంచ్ పార్వతి, యువనేత ఆలూరు ఎర్రిస్వామి రెడ్డి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు చేపల రమణ, కొండమ్మ, సాకే లక్ష్మీనారాయణ, పురుషోత్తం, పెద్ద కొండయ్య, శివ పాల్గొన్నారు.

గుత్తి రూరల్: సమాజంలో ప్రతి పౌరునికి విజ్ఞానం పంచే గురువులు అందరికీ మార్గదర్శకులని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మునిసిపల్ చైర్ పర్సన్ వన్నూరుబీ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం ఎంపీపీ, చైర్ పర్సన్లను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓ రవినాయక్, ఉపాధ్యాయులు శివశంకర్, సత్యనారాయణ, శ్రీనివాసులు, రామచంద్ర, లక్ష్మణ్, గీత పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: ప్రతి విద్యార్థి నైతిక విలువలు పాటించాలని తహసీల్దార్ మునివేలు అన్నారు. మంగళవారం స్థానిక పద్మవాణి హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఈఓ నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు నాగపీరయ్య, పాల్గొన్నారు. పెన్షనర్ల భవనంలో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి గురువు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, శకుంతలమ్మను సత్కరించారు.

తాడిపత్రి: ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ నాగరాజు, రామగోవిందరెడ్డి సిబ్బందితో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. టెక్ జూనియర్ కళాశాలలో సిబ్బందికి క్రీడా పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ ఈవీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్, డీఓఏ నటరాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలూరు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు నాగరాజు, గంగాధర్‌రెడ్డి, పార్వతమ్మ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. నంద్యాల రోడ్డులోని సూర్య హై స్కూల్‌లో కరస్పాండెంట్ దూదేకుల బాబయ్య సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయుడు రాధాకృష్ణారెడ్డిని సత్కరించారు.

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య, రిటైర్డ్ హెచ్ఎం చింతామునిస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. గురువుల గొప్పతనాన్ని చింతామునిస్వామి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాలాబాయి, అధ్యాపకులు శివప్రసాద్, నాగమణి గురువు ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. స్థానిక రోటరీహైస్కూల్‌లో స్కూల్ సీనియర్ ఉపాధ్యాయురాలు విమలను స్కూల్ యాజమాన్యం, రోటరీక్లబ్ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో రోటరీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జీవీ.లక్ష్మణ, కరస్పాండెంట్ వీఎల్.గుప్త, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద, మాజీ అధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం టీచర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఎస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రస్సెల్ కిరణ్, హెచ్ఎం కిరణ్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, రిటైర్డ్ ఏఎస్‌బ్యూఓ మల్లికార్జున ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రస్సెల్ కిరణ్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని వివరించారు. ఉపాధ్యాయులు పుష్పరాజ్, విజయశేఖర్, ప్రభాకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసినప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని లక్ష్మంపల్లి, చిత్రచేడు జెడ్పీ పాఠశాలల హెచ్ఎంలు హరినాథ్, మధుసూదన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలోనూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

గుంతకల్లు రూరల్: ఉపాధ్యాయులను సత్కరించడం అందరి బాధ్యత అని జేవీవీ వ్యవస్థాపక సభ్యుడు గంగరాజు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొలకలపెంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మారెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నెలగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

పామిడి: ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక టీసీ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీచర్స్ డే ప్రాముఖ్యతను వక్తలు వివరించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం వీసీ సుంకన్న పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీఎస్‌లో...

గుంతకల్లు : శ్రీ శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో (ఎస్ఎస్‌జీఎస్) ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కరెస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాళ్లు బి.గోపాల్, బ్రహ్మానందరెడ్డి డాక్టర్ సర్వపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల నివాళుర్పించారు. అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.